
సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు అడ్డంకి



- గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యానికి నోచుకోని అర్హులు
- రాజీవ్ యువ వికాసానికీ రేషన్ కార్డుతో లింకు
- దరఖాస్తు చేసుకోలేకపోతున్న నిరుద్యోగులు

చింతలమానేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకానికి రేషన్ కార్డుతో లింకు పెడుతుండడంతో కార్డులు లేని వారికి శరాఘాతంగా మారింది. తాజాగా రాజీవ్ యువ వికాసం పథకానికి కూడా రేషన్ కార్డుతో లింకు పెట్టింది. దీంతో రేషన్ కార్డులు లేని నిరుద్యోగులు ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తున్నది. రేషన్ కార్డులు ఇప్పుడు ఇస్తాం.. అప్పుడు ఇస్తాం.. అంటూ ఊరిస్తున్న ప్రభుత్వం ఏడాదిన్నర గడుస్తున్నా కార్డులు జారీ చేయకపోవడంతో అనేక మంది ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు.

కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు..

నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 50శాతం వరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి యూనిట్‌ను బట్టి 40 నుంచి 80 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇవ్వనున్నారు. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు సైతం ఇటీవల వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు విధించారు. గతంలో ఆయా కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటాను వెబ్‌సైట్ నుంచి తొలగించకపోవడంతో కొత్తగా దరఖాస్తులు ఎంట్రీ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకానికి కూడా రేషన్ కార్డులుతో ముడిపెట్టడంతో కార్డులు లేనివారు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ కార్డు లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే స్వీకరించడం లేదని పలువురు నిరుద్యోగులు తెలిపారు.

అన్ని పథకాలకు రేషన్ కార్డుతో లింకు..

ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుతో ముడి పెట్టడం కార్డులు లేని వారికి శాపంగా మారింది. గత ప్రభు త్వ హయాంలో చివరగా 2021లో కొంత మందికి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేశారు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారం లోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డులను జారీ చేస్తా మని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన, గ్రామ, పట్టణ సభల్లో గ్యారెంటీ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం రేషన్ కార్డులు లేని వారి నుంచి సైతం దరఖాస్తులు తీసుకున్నారు.

కానీ ఇప్పటి వరకు కార్డులను జారీ చేయలేదు. ఈ ఏడాది జనవరి 26న పైలట్ ప్రాజెక్టులో మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి కార్డులను జారీ చేసింది. గ్రామ, పట్టణ సభల్లో కొత్తగా మరిన్ని దరఖాస్తులు స్వీకరించారు. మీ సేవా కేంద్రాల ద్వారా కూడా దరఖాస్తులు తీసుకుంటున్నారు. కానీ కొత్తకార్డులను జారీ చేయడంలో ప్రభుత్వం తీవ్రఅలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని నిరుద్యోగులు వాపోతున్నారు. ఇప్పుడు..అప్పుడు అంటూ ప్రభుత్వ పెద్దలు ఊదర గొడుతున్నారే గానీ కార్డులు మాత్రం ఇవ్వడంలేదని ఆయా సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నాని ఆవేదన చెందుతున్నారు. రేషన్ కార్డు లేక అనేక మంది 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500లకు సబ్సిడీ గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం ఇలా ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందలేకపోతున్నారు. తాజాగా రాజీవ్ యువ వికాసం పథకానికి కూడా రేషన్ కార్డు తప్పని సరి ఉండాలని నిబంధన విధించడంతో కార్డులులేని వారు ఆందోళన చెందుతున్నారు. రేషన్ కార్డుల కోసం జిల్లాలో సుమారుగా 15వేల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్వరమే రేషన్ కార్డులను జారీ చేసి రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకునే గడువును మరో 15 రోజులు పొడిగించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి

చౌదరి నవీన్, బాలాజీ అనుకోడ



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులకు గడువును పెంచాలి. చాలా మంది కుల, నివాస, ఆదాయం సర్టిఫికెట్‌ల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్ కార్డు లేని వారు నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వం పునరాలోచించాలి.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ఈ నెల 30 లోగా పూర్తి చేసి ఎంబీ రికార్డులు సమర్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌లో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు ఈ నెల 30లోగా పూర్తి చేసి ఎంబీ రికార్డులు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మండలాల వారీగా మంజూరైన పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడులా నాణ్యత పాటించే విదంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 40.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది. జిల్లాలోని రెబ్బెన మండలంలో 40.9 డిగ్రీలు, వాంకిడిలో 40.7 డిగ్రీలు, తిర్యాణిలో 40.6 డిగ్రీలు, పెంచికలపేటలో 40.5 డిగ్రీలు, సిర్పూర్(టి), కెరమెరి, కౌటాలలో 40.4 డిగ్రీలు, కాగజ్‌నగర్‌లో 40.3 డిగ్రీలు, బెజ్జూరులో 40.2 డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 11 కేవీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు చోర్‌పల్లి, నందుపా గ్రామ పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిచి పోనున్నట్లు ఏఈ ఉర్మిళ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని కేబీనగర్‌లో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా యాన మాట్లాడుతూ కేబీ నగర్‌లో ఐదు లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, జీవన్, గణేష్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలలో అపోలో ఫార్మసీలో 100 పోస్టులు, స్టఫ్పింగ్ టైటన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9440514962, 8522903936 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కాగజ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాడానగర్‌లో గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు డాడానగర్‌ను అభివృద్ధి చేసేందుకు నిధులను మంజూరు చేయించారు. రూ.5లక్షల సీసీ రోడ్డు తొలి దఫా పూర్తి చేశారు. తాజాగా రూ.10లక్షలు విడుదల కావటంతో రెండో దఫా సీసీ రోడ్ల పనులు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిందం శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీ ఎలక్ట్రీషియన్‌కు వీడ్కోలు సన్మానం

రెబ్బెన, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌పీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ మెడికల్ బోర్డు ఇన్వాల్యుడేషన్ పొందిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు రామయ్యకు వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గోలేటి సీహెచ్‌పీ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రెటరి శ్రీనివాస్, జనరల్ షిఫ్టు ఇన్‌చార్జి ఆదాం సమి, గజ్జల రాజయ్య, అమర్ సింగ్‌తో కార్మికులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

- సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్

ఆసిఫాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యాక్రమంలో జిల్లాలకు సంబంధించి వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ అధికారులకు సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్నిప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు సమర్పిస్తున్నారని, జిల్లాస్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు హైదరాబాద్ వరకు వస్తున్నాయని, ఆయా దరఖాస్తులను సంబంధిత జిల్లాలకు పంపిస్తున్నామని తెలిపారు. జిల్లాలకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద వచ్చిన దరఖాస్తులపై విచారించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు మున్సిపల్ సిబ్బందితో సమగ్ర విచారణ జరిపిం చి అర్హులైన వారికి పథకం అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ డేవిడ్, ఈడ్రిస్టిక్ మేనేజర్ గౌతం, ప్రజావాణి విభాగం పర్యవేక్షకులు సునీల్, సమంత, అధికారులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

రెబ్బెన, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన వరదలగూడలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో శంకరమ్మకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వరదలగూడలో మంచినీటి సౌకర్యం లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రేంసాగర్, సతీష్, సునీల్, మహేందర్‌గౌడ్, అనిల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అభివృద్ధి, సంక్షేమ పథకాలను పకడ్బందీగా చేపట్టాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు, యూనిక్ డిసెబులిటి ఐడీ గుర్తింపు కార్డుల జారీ, దివ్యాంగులకు సదరం శిబిరాల నిర్వహణ, పరికరాలు సమకూర్చడం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో అర్హులైన కుటుంబాలను గుర్తించడం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, స్వయం సహాయక సంఘాలకు విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీకి కేటాయింపు, జిల్లా కేంద్రంలో మహిళాశక్తి భవన నిర్మాణం, తదిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కొరకు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులకు లబ్ధిచేకూరే విధంగా చర్యలు తీసుకో వా లన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేపట్టిన యూనిక్ డిసెబులిటి ఐడీ గుర్తింపు కార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ భవన సముదాయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. దివ్యాంగులకు యూనిక్ డిసెబులిటీ ఐడీ కార్డులను జారీ చేసేందుకు సదరం క్యాంపుల నిర్వహణ, పరికరాలు సమకూర్చడం కొరకు భవనాన్ని గుర్తించామన్నారు. సమావశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అదికారి దత్తారావు, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పారిశుధ్యంపై దృష్టిసారించాలి



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

సిర్పూర్(టి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని గురువారం కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ గీత సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను ఆమె పరిశీలించి వైద్యులకు పారిశుధ్యం, తదితరాలపై సూచనలు ఇచ్చారు. 24 గంటలు ఆసుపత్రిలో, ఆవరణలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఆమె వెంట ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనూష, కల్పకాయ బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని నిరసన

కాగజ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి మాజీ సర్పంచ్‌లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాజీసర్పంచ్‌లు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అభివృద్ధి పనులు చేసినట్టు వీటి తాలుకూ బిల్లులు ఇంత వరకు మంజూరు కావటం లేదన్నారు. అప్పులు చేసి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో తమ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నగునూరి శ్రీనివాస్, రాజన్న, పున్నం తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేస్తున్న మాజీ సర్పంచ్‌లు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్



ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రాపర్తి రవీందర్ ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి పీసీ జైన్, సహాయ ఎన్నికల అధికారి నికోడే రవీందర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పోటీల్లో బోనగిరి సతీష్‌బాబు, రాపర్తి రవీందర్ ఉండగా సతీష్‌బాబుపై 10 ఓట్ల మెజార్టీతో రవీందర్ గెలుపొందారు. వరుసగా రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌ను పలువురు న్యాయవాదులు అభినందించారు. అలాగే ఉపాధ్యక్షులుగా చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా చరణ్, సంయుక్త కార్యదర్శిగా నగేష్, కోశాధికారిగా ఎం రామకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా కుమారం లాల్‌షా, మహిళా ప్రతినిధి ఆర్.గాయత్రి, మధురిమ, క్రీడల సాంస్కృతిక కార్యదర్శిగా కిశోర్‌కుమార్ ఎన్నికయ్యారు.

హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. ఉద్యమ పితామహుడు అప్పారి వెంకటస్వామికి గురువారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడిన నాలుగు వాయిదాల డీఏను, పీఆర్సీని అడగొద్దని అవి కావాలంటే నెలనెల జీతాలే ఇవ్వలేమని సీఎం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోవడం లేదని న్యాయంగా రావాల్సిన బకాయిలను, వారు దాచుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఇందురావు, రమేష్, హేమంత్, రాజకమలా కర్‌రెడ్డి, సుభాష్, మహిపాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ

కౌటాల, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో గురువారం అధికారులు స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో ఖమర్ హుస్సెన్, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఎస్‌సీఆర్పీ పోచాని ఆధ్వర్యంలో స్కూల్ గ్రాంట్స్‌తో స్పోర్ట్స్ మెటీరియల్, చైర్స్, రిజిస్టర్లు పంపిణీ చేశారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

బెజ్జూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడిగూడలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. గ్రామస్థులు విరాళాలు సేకరించి నూతనంగా నిర్మించిన ఆలయంలో మంత్రోచ్ఛరణల మధ్య పోచమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ముందుగా విగ్రహాలకు జలాభిషేకం, ధాన్యాభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి పోచమ్మ, పోతరాజు విగ్రహాలను ప్రతిష్ఠాపించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొనగా వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

సిర్పూర్(టి), మార్చి 27(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జీషాన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ప్రభుత్వ పరంగా మూడు మసీదుల కమిటీల ఆధ్వర్యంలో రంజాన్ మాసంను పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందులో మండలంలోని ముస్లింలు పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వపరంగా ఏ ఒక్క మండల స్థాయి అధికారి పాల్గొనకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జమా మసీద్ అధ్యక్షులు అబ్దుల్ రషీద్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ షకీల్, దర్గా కమిటీ అధ్యక్షుడు షేక్ సాలే, సీనియర్ ఫార్మసిస్టు అహ్మదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతీ రోజు బడికి వచ్చేలా బాధ్యత తీసుకోవాలి



విద్యార్థులను బడికి పంపిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి రోజు బడికి వచ్చేలా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని ఎంఈవో హన్మంతు అన్నారు. గురువారం మండలంలోని తలోడి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులు తరుచుగా గైర్హాజరు అవుతున్నారని తెలిసి పాఠశాలను సందర్శించారు. అనంతరం టీచర్ ప్రసాద్‌తో కలిసి విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు ప్రతీరోజు తప్పకుండా పంపించాలని సూచించారు. అలాగే విద్యార్థులను దత్తత తీసుకుని పాఠశాలకు తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు

చింతలమానేపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ముళ్ల పొదళ్లను శ్రీ శివరా మసాయి యూత్ వెల్ఫేర్ అధ్యక్షుడు గుర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులు గురువారం తొలగించారు. డబ్బా, బారెగూడ మహాత్మజ్యోతి రావుఫూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల సమీపంలో, కౌటాల ప్రధాన రహదారిలో ఉన్న ముళ్లపొదళ్లను తొలగించారు. ముళ్ల పొదళ్లతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో తొలగించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్, తిరుతి, శేఖర్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

'ఒకేదేశం ఒకే ఎన్నిక' తో దేశాభివృధి

లింగాపూర్ మార్చి, 27 (ఆంధ్రజ్యోతి): ఒకేదేశం ఒకే ఎన్నికతోనే దేశాభివృధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. గురువారం లింగాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తరచూ ఎన్నికలు నిర్వహణతో అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేష్, అశ్విన్, అశోక్, రవీందర్, రాహుల్, అరవింద్, సచిన్, రంజిత్ పాల్గొన్నారు.

కూలీలందరికీ 'ఉపాధి' కల్పించేలా చర్యలు

● ఏపీవో గోవర్ధన్ సింగ్



ఆంధ్రజ్యోతి : ఉపాధిహామీ కూలీలకు పని కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏపీవో : ఉపాధిహామీ కూలీలందరికీ పని కల్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశాలు ఏర్పాటు చేసి జాబ్ కార్డులు కలిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి?

ఏపీవో : మండలంలో 8156 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 5,890 కుటుంబాల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. ఇందులో 17,854మంది కూలీలు ఉండగా 11,544 యాక్టీవ్‌గా పనిచేస్తున్నారు. 144కుటుంబాలు 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి : ఉపాధిహామీ పథకం ద్వారా ఇంకా ఎలాంటి అభివృద్ధి పనులు చేపడుతున్నారు?

ఏపీవో : పొలంబాట కార్యక్రమం ద్వారా పొలాలకు రోడ్లు వేస్తున్నాం. అలాగే పశువుల పాక, షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. వెయ్యి కోళ్లకు ఫాం నిర్మాణం చేపడుతున్నాం.

- చింతలమానేపల్లి (ఆంధ్రజ్యోతి)

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

- నిరుపయోగంగా స్త్రీనిధి భవనం
- చెదలు పడుతున్న తలుపులు, కిటికీలు
- పట్టించుకోని అధికారులు
- శిథిలావస్థలో పాత భవనం



ప్రారంభానికి నోచుకోని స్త్రీ నిధి భవనం

సిర్పూర్(టి), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చింది నిర్మించిన స్త్రీనిధిభవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో మహిళాసంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో కోట్ల రూపా యలతో వారికి వరికొనుగోలు కేంద్రాలు, వారి పొదుపును బట్టి మండలానికి ఒకటిచొప్పున ఆర్టీసీలో అద్దెకు బస్సులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్నది. కానీ వారికి నెలనెలా సంఘాల సమావేశాలు, అవగాహన సదస్సుల కోసం నిర్మించిన పక్కాభవనం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ స్థలంలో పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆదర్శ మండల సమాఖ్య కింద ఎంపిక చేసి రూ.10 లక్షల నిధులతో స్త్రీ నిధి భవన నిర్మాణం చేపట్టింది. ఇందులో అన్ని విధాల లావాదేవీలు జరుపుకునేలా, సమావేశాలు, అవగాహన సదస్సులు, కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటుకు, విస్తారాకుల తయారీ, కంప్యూటర్ గది లాంటివి ఏర్పాటు చేసుకునేలా భవన నిర్మాణం చేపట్టారు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ భవనం వైపు ఒక్క అధికారిగానీ, ప్రజాప్రతినిధులు కానీ కన్నెత్తి చూడడం లేదు. దీంతో భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. లక్షల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరులా మారిపోయాయి. మండలంలో 5,600 మంది డ్వాక్రా మహిళలు, 23వీవో గ్రూపులు, 19 మండల సమాఖ్య సంఘాలు ఉన్నాయి. భవన నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో పాత భవనంలో సరిప డాస్థలం లేకపోవడంతోపాటు శిథిలావస్థకు చేరడంతో మండలంలోని డ్వాక్రా మహిళలు ఇబ్బందులు పడుతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిర్మాణం చేపట్టిన స్త్రీనిధి భవ నాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న సెర్ప్ కార్యాలయం

అధికారులు పట్టించుకోవడం లేదు..

- దుర్గయ్య, ఏపీఎం

స్త్రీ నిధి భవనం నిర్మాణం చేపట్టినా నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ విషయాన్ని సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి ఎన్నోసార్లు విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదు. ఇలా ఉంటే నిర్మాణం అయిన భవనం కూడా కూలిపోయే ప్రమాదం ఉంది.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సీఐ దేవేందర్‌రావు



నాటు సారా సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

చెన్నూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ దేవేందర్‌రావు సూచించారు. మండలంలోని పొక్కూరు గ్రామంలో సీఐ దేవేందర్‌రావు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 50 బైక్‌లను, ఇతర వాహనాలను సీజ్ చేశారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఆరు లీటర్ల నాటుసారాను, 30 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ దేవేందర్‌రావు మాట్లాడుతూ యువత, గుట్కా, జూదం, నాటుసారా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

బెల్లంపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన మంథెన శివకుమార్ (30) జీవతంపై విరక్తి చెంది గురువారం ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు శివకుమార్ ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆరు నెలల క్రితం శివకుమార్ భార్య కుటుంబకలహాలతో ఇంట్లో నుంచి వెళ్లి వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. అలాగే నాలుగేళ్ల కిందట శివకుమార్ రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు విరిగిపోయింది. దీంతో డ్రైవర్ ఉద్యోగం చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు, ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు శివకుమార్ తల్లి రామక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి, మార్చి27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు పసుపు కలర్ టీషర్ట్, ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు. సమాచారం తెలిసిన వ్యక్తులు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ ఫోన్‌నంబర్ 9948481902లో సమాచారం అందించాలని తెలిపారు.

బస్సు కింద పడి మహిళకు గాయాలు

లక్షెట్టిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో గురువారం ఆర్టీసీ బస్సు వెనక టైరు కింద పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం లక్షెట్టిపేట బస్టాండ్ నుంచి మంచిర్యాల వెళ్తున్న ఆర్టీసీ బస్సు అంబేద్కర్ విగ్రహం వద్ద మూల మలుపుతుండగా వెనుకాల నుంచి స్కూటీపై దంపతులు వస్తున్నారు. ఈ క్రమంలో స్కూటీ ప్రమాదవశాత్తు బస్సు వెనుక టైరు వద్ద ఇరుక్కుపోవడంతో దివ్య అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఒకరికి తీవ్రగాయాలు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం చెక్‌పోస్టు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో కారు యాజమానికి తీవ్ర గాయాలైనట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి మట్టి లోడుతో వస్తున్న లారీ ఇందారం చెక్‌పోస్టు సమీపానికి రాగానే రహదారిపై లారీ ఆగిపోయింది. గోదావరిఖనికి చెందిన రేణికుంట్ల దత్తమూర్తి తన కారులో మంచిర్యాలకు వస్తుండగా ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. సంఘటన స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయాలపాలైన దత్తమూర్తి గోదావరిఖని ఎన్‌టీసీలోని అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటాడని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివకుమార్



శివకుమార్



రవికుమార్

బెల్లంపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బార్‌అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఎన్నికలు గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అంకం శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా చేను రవికుమార్ ఎన్నికయ్యారు. వీరికి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శివకుమార్, రవికుమార్ వారు తెలిపారు.

'భగీరథ' నీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం

- యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్

వాంకిడి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని పెరకవాడలో మిషన్ భగీరథ నీటి సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వాంకిడి మండల కేంద్రంలోని పెరుకవాడ, మండోకర్‌వాడలో మిషన్ భగీరథ నల్లాలు బిగించి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు చుక్కనీరు రాలేదన్నారు. నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఏఈ శైలేందర్ దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లినా స్పందించడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు వికాస్, సాయి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

కాసిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సోమగూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం తెల్లవారుజామున బ్రేక్ డౌన్ అయి ఆగి ఉన్న ఐరన్ లోడ్ లారీని మరో లారీ ఢీకొట్టింది. లారీని ఢీకొట్టిన డ్రైవర్ గుల్జర్ సింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, కాసిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ బిలాయి నుంచి ఐరన్ లోడ్‌తో మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ సోమగూడెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైకి రాగానే బ్రేక్‌డౌన్ అయి రోడ్డుపై నిలిచిపోయింది.

ఈ క్రమంలో బెల్లంపల్లి నుంచి మంచిర్యాలకు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ గుల్జర్‌సింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి కేకేలు వేశాడు. స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. 108 సిబ్బంది లారీలో ఉన్న డ్రైవర్‌కు ఆక్సిజన్, ఫ్లూయిడ్స్ అందించారు. 108, ఫైర్ సిబ్బంది, పోలీసులు గ్యాస్ కట్టర్ సహాయంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను 3 గంటల పాటు శ్రమించి బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

బెజ్జూరు/పెంచికలపేట/దహెగాం/ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం మండలంలో మాజీ సర్పంచ్‌లను పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్‌లోని గన్‌పార్కు వద్ద ధర్నా చేసేందుకు వెళ్తున్నారనే సమాచారంతో ఆయా మండలాల్లోని మాజీ సర్పంచ్‌లను అరెస్ట్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జన్నారం: మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి జన్నారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో జాడి గంగాధర్, సంతోష్, రవి ఉన్నారు.



బెజ్జూరు, జన్నారం పోలీసు స్టేషన్ ఆవరణలో మాజీ సర్పంచ్‌లు

ఆధునిక సాంకేతిక విద్యపై దృష్టి సారించాలి

దండేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఏఐ పాఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో దుర్గం చిన్నయ్య సూచించారు. మండలంలోని గుడిరేవ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ద్వారక స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చిన్న నరసయ్యతో కలిసి విద్యార్థులకు ఏఐ విద్యాబోధన ప్రయోగశాలను వారు ప్రారంభించారు. మండలంలోని వెల్లనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బుచ్చన్న, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీఎం ఎన్నికలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించేట్టు చూడాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఎస్పీఎం పునరుద్ధరణ జరిగినప్పటికి ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించటం లేదని, దీంతో యాజమాన్యం కార్మికులపై వేధింపుచర్యలకు పాల్పడుతోందని, యాజమాన్యం కార్మికుల శ్రేయస్సు కోసం కనీసం క్యాంటిన్ సౌకర్యం కల్పించటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించేట్టు తగిన చర్యలు తీసుకోవాలని సభా దృష్టికి తీసుకువచ్చారు.

కేటీఆర్‌పై అట్రాసిటి కేసు నమోదు దారుణం



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నల్గొండ జిల్లా నకిరేకల్‌లో పదో తరగతి పరీక్ష పేపరు లీకేజీ వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ మాజీ మంత్రి కేటీఆర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయటం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్ష పేపరు లీకేజీలో మాజీమంత్రికి సంబంధమే లేదన్నారు. పోలీసులు కనీస నిబంధనలు పాటించకుండా కేసులు నమోదు చేస్తుండటం విస్మయానికి గురిచేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తన స్థాయికి మించి మాట్లాడుతున్నారన్నారు. బెజ్జూరు పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని కబ్జా చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, రాజు, ఆవుల రాజ్‌కుమార్, నిత్యానంద్, మినాజ్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపోనకు చెందిన కండక్టర్ కేజే రావు నిజాయితీని చాటుకున్నారు. ఆసిఫాబాద్ నుంచి చంద్రాపూర్ వెళ్లుతున్న బస్సులో గురువారం ప్రవళిక అనే ప్రయాణికురాలు బెండార కాలేజీ వద్ద దిగి పోతూ తన ముఖ్యమైన సర్టిఫికెట్లను బస్సులోనే మరిచి పోయింది. బస్సును తనిఖీ చేస్తుండగా, కండక్టర్ వాటిని గుర్తించి వెంటనే డిపో అధికారులకు సమాచారం అందించారు. సర్టిఫికెట్‌లోని వివరాల ఆధారంగా ప్రవళిక ఆచూకీ కనుగొని ఆమెకు డిపో మేనేజర్ రాజశేఖర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డీఎం కండక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీఐ-3 భారతి తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

వేమనపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం జరుగుతున్న నీటికుంట పనులను గురువారం ఎంపీడీవో కుమార స్వామి పరిశీలించారు. మస్టర్ వెరిఫికేషన్ చేసి కూలీలకు తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం సైబర్ మోసాల గురించి కూలీలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో, ఏపీవో సత్యప్రసాద్ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు లక్ష్మణ్, క్షేత్ర సహాయకులు రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

మూడో యూనిట్ ఏర్పాటుకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో మూడవ యూనిట్ ఏర్పాటుకు బీహెచ్‌ఈఎల్ కంపెనీ, సింగరేణి అధికారులు సిద్ధంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణ, డైరెక్టర్ ఆపరేషన్స్ సూర్యనారాయణరావు సూచించారు. గురువారం ఎస్టీపీపీలోని గెస్ట్‌హౌజ్‌లో సింగరేణి అధికారులు, బీహెచ్‌ఈఎల్ కంపెనీ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్‌కు సింగరేణికి, బీహెచ్‌ఈఎల్ కంపెనీ మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. ముందస్తు ప్రణాళికలు, టెక్నికల్ రివ్యూస్, కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి షెడ్యూలు, క్వాలిటీ, ఆడిట్, బిల్లింగ్‌కు సంబంధించిన విధివిధానాల గురించి చర్చించారు. మూడో యూనిట్ ప్రతిపాదిత స్థలం అన్ని విధాలుగా అందుబాటులో ఉందని, సింగరేణి తరుపున అన్ని రకాలుగా బీహెచ్‌ఈఎల్ కంపెనీకి సహకరిస్తామన్నారు. యూనిట్‌కు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, నిర్ధిష్ట సమయంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. భూమి పరీక్షలు, సైట్ మొబిలైజేషన్ పనులను ఏప్రిల్ మొదటి వారంలో పూర్తిచేయాలని సూచించారు.

సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు పా కె వెంకటేశ్వర్లు, జీఎం కో ఆర్డినేషన్ సుబాని, జీఎం మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ సుబ్బారావు, అధికారులు నారాయణ, సుబ్బారావు, విశ్వనాధరాజు, మురళీధర్, మదన్‌మోహన్, తుకారాం, వేణుగోపాల్ రావు, బీహెచ్‌ఈఎల్ అధికారులు ఆశా, శివసేనన్ వర్మ, మధుకిరణ్ పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో హాజరు శాతం పెంచాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అధికారులు స్పందించి భూగర్భ గనుల్లో హాజరు శాతం పెంచాలని జీఎం ఎం శ్రీనివాస్ సూచించారు. ఎస్ఆర్‌పీ-1, ఎస్ఆర్‌పీ-3 గనుల్లో పనిచేస్తూ విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలన్నారు. కానీ కొందరు ఉద్యోగులు విధులకు గైర్హాజరవుతూ వ్యక్తిగతంగా, కుటుంబానికి నష్టం చేకూరుస్తున్నారని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ విధులకు రావాలని సూచించారు. లేదంటే సంస్థాగత చర్యలుంటాయని హెచ్చరించారు. కౌన్సెలింగ్‌కు 43 మంది ఉద్యోగులు తమ కుటుంబసభ్యులతో హాజరయ్యారు. సమావేశంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్ బాబు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవైపీఎం రాజేశం, ఎస్ఆర్‌పీ-1 సంక్షేమ అధికారి వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల పాల్గొన్నారు.

మొదలైన వాకింగ్ ట్రాక్ పనులు

మందమర్రి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభమయ్యాయి. కొద్ది సంవత్సరాల క్రితం 10 లక్షలతో యాజమాన్యం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసింది. అది ఇటీవల చెడిపోవడంతో యాజమాన్యం 13 లక్షలతో ప్రారంభించింది. దీనికి సంబంధించి ఇరుపక్కల తవ్వకాలు చేపట్టింది. ప్రధానంగా వాకర్లు నడిచేటప్పుడు మోకాళ్ల నొప్పులు రాకుండా కుషన్ ఉండేలా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ వాకింగ్ ట్రాక్ సరిగా లేకపోవడంతో వాకర్లతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ పనులను యాజమాన్యం ప్రారంభించింది. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేసి వాకర్లకు అందుబాటులోకి తేవడానికి పనులు జరుగుతున్నాయి. ఈ పనులపై సివిల్ అధికారులతో పాటు ఏరియా జీఎం దేవేందర్ ప్రత్యేక దృష్టి సారించారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.



కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా అన్నారు. ఏరియా వర్క్‌షాప్‌ను గురువారం ఆయన సందర్శించారు. టెక్నషియన్స్, ఇతర ఉద్యోగులతో మాట్లాడారు. ఇటీవల జీఎంతో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో పలు అంశాలను ప్రస్తావించినట్లు తెలిపారు. మహిళలకు టాయిలెట్స్, విశ్రాంతిగదులు, అదనంగా సైకిల్ షెడ్ నిర్మించాలని కోరారు. అనారోగ్యంతో బాధపడే జనరల్ మజ్దూర్ కార్మికుల స్థానంలో ఆరోగ్యవంతులైన వారిని కేటాయించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అప్పటికప్పుడే డీజీఎం(వర్క్‌షాప్) దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, మైనింగ్ స్టాఫ్ నాయకుడు అడ్డు శ్రీనివాస్, ట్రేడ్స్‌మెన్ నాయకుడు సురేష్, పిట్ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

శ్రీరాంపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రెండురోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల జిల్లాకు రానున్నారు. 3 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రాత్రి సీసీసీలోని సింగరేణి గెస్టహౌస్‌లో బస చేస్తారు. శనివారం ఉదయం 7.30 గంటలకు ఆర్‌కే-7, ఆర్‌కే న్యూటెక్ గనులను సందర్శించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటారు. ఉదయం 11 గంటలకు ఎస్టీపీపీలో నిర్వహించే ఆర్‌ఓఆర్ సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 1.30 గంటలకు పెద్దపల్లి జిల్లాకు బయలుదేరుతారు. సింగరేణిలో పనిచేసే ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్ వెంకటయ్య దృష్టికి తీసుకురావచ్చని శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ లైజన్ అధికారి, ఈఈ(ఐఈడీ) కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉగాది నుంచి సన్న బియ్యం



- జిల్లాలో మూడు వేల మెట్రిక్ టన్నుల పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం
- ఎదురుచూస్తున్న నిరుపేదలు

కాసిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెల్లరేషన్ కార్డులందరికి సన్నబియ్యం అందజేస్తామని ఇచ్చిన హామీని రేవంత్ రెడ్డి సర్కారు ఈ ఉగాది నుంచి అమలులోకి తేనుంది. దీంతో అధికార యంత్రాంగం ఆ దిశగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా 423 రేషన్ దుకాణాలకు సన్నబియ్యం చేరవేసేందుకు ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో 2,19,329 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 15590 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 6,35,176 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకు గాను 3 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం కానున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఏప్రిల్ 1 ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ముందుచూపుతోనే సన్నబియ్యం పథకం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే సన్నాల సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. సన్న వడ్ల సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి కనీస మద్దతు ధరతో పాటు క్వింటాకుకు రూ. 500 బోనస్ ప్రకటించింది. దీంతో సన్నరకం వరిసాగుకు ఆసక్తి కనబర్చి పండించారు. దీంతో సన్న వరి సాగు విస్తీర్ణం జిల్లాలో గణనీయంగా పెరిగింది. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సన్న బియ్యం కొనుగోలు చేసి నాలుగు నెలలకు సరిపడా నిల్వలు భద్రపర్చినట్లు సమాచారం. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పాటు పెరిగిన బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారాయి. ప్రభుత్వం ఉగాది నుంచి తెల్లరేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో 6 లక్షల మంది సామాన్య ప్రజలకు ఊరట లభించనుంది.

● అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా..?

గతంలో రేషన్ షాపులో ఇచ్చే దొడ్డు బియ్యాన్ని బయట మార్కెట్‌లో కిలోకు రూ. 10 నుంచి 15 చొప్పున అమ్ముకునే వారు. లేదా రేషన్ డీలర్లు అక్కడే కొనుగోలు చేసి నగదు చెల్లించేవారు. అంతేకాకుండా రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు గ్రామాల్లోకి దళారులు నేరుగా వచ్చి బియ్యం కొని అక్రమ మార్గంలో మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకునేవారు. మంచిర్యాల జిల్లాకు మహారాష్ట్ర పక్కనే ఉండడంతో రైలు మార్గం ద్వారా రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటేది. దీంతో దళారులు సొమ్ము చేసుకునేవారు. దీంతో 50 శాతానికి పైగా దొడ్డు బియ్యం అక్రమ రవాణా జరిగేదని అధికారులు అంచనా వేశారు. సన్నబియ్యం పంపిణీతో రైనా బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందేమో వేచి చూడాల్సిందే. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు.

ఆనందంగా ఉంది..



ప్రభుత్వం ఈ ఉగాది నుంచి సన్నబియ్యం ఇస్తామని చెప్పడం మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఎంతో ఆనందంగా ఉంది. మార్కెట్‌లో పెరిగిన ధరల తో బియ్యం కొనే పరిస్థితి లేదు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తామని చెప్పడం సంతోషంగా ఉంది. కొన్నేళ్లుగా దొడ్డు బియ్యంతోనే సరిపెట్టుకుంటున్నాం. నాలాంటి నిరుపేదలకు బియ్యం కొనే ఆర్థిక భారం తగ్గుతుంది.

- కొమురె మల్లేష్, కొండాపూర్ యాప

సామాన్యుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..



సామాన్య ప్రజల సంక్షేమంకోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఈ గాది నుంచి శ్రీకారం చుట్టాం. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది.

- గడ్డం వినోద్‌వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే

ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నాం

ఏఈ, శ్రీనివాస్, చెన్నూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : చెన్నూరు పరిధిలో లో ఓల్టేజీ సమస్య ఉందా, ఉంటే ఎలా పరిష్కరిస్తారు?

ఏఈ : చెన్నూరు పరిధిలో ఎక్కడా లో ఓల్టేజీ సమస్య లేదు. ఎక్కడైనా ఉన్నట్లు మాదృష్టికి తెస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

ఆంధ్రజ్యోతి : వేసవిలో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉంటుంది. ఇందుకు అనుగుణంగా సరఫరా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారా?

ఏఈ : సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు సిద్ధంగా ఉన్నాం. వేసవిని దృష్టిలో పెట్టుకుని చెన్నూరు సెక్షన్‌లో ఇప్పటికే 10 నూతన ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాం. మరి కొన్ని బిగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఆంధ్రజ్యోతి : అర్హులైన గృహ జ్యోతి అందని లబ్ధిదారులు ఎవరైనా ఉన్నారా, అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందా?

ఏఈ : ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి గృహజ్యోతి పథకం వర్తించింది. ఇంకా కొంత మంది లబ్ధిదారులు ఉన్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తేనే వారికి కూడా గృహ జ్యోతి పథకం వర్తిస్తుంది.

ఆంధ్రజ్యోతి : ఎగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటుతోంది, దీంతో విద్యుత్ వాడకం పెరుగుతుంది. ఈ క్రమంలో చెన్నూరులో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. మీ దృష్టికి వచ్చిందా, దీన్ని ఎలా అధిగమిస్తారు?

ఏఈ : ఇప్పటి వరకు పట్టణంలో ఎక్కువ విద్యుత్ అంతరాయం ఏర్పడ లేదు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఉన్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తాం. అవసరం ఉన్న చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం.

-చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలి

భీమిని, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగులో పంటల మార్పిడి పద్ధతిని పాటించడం వల్ల అధిక ప్రయోజనాలు పొందవచ్చని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పంట పొలాలను సందర్శించారు. వ్యవసాయ అధికారులు అందించిన సలహా సూచనల మేరకు పంట మార్పిడి పద్ధతి అవలంబించిన రవీందర్ అనే రైతును ఏడీఏ సురేఖ పాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీసారి ఒకే రకమైన పంటలు వేయకుండా తరుచూ పంటలు మార్పిడి చేయడం వల్ల రైతులు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. గ్రామాల్లో రైతులు గ్రెసిల్ విత్తనాలను వాడకుండా లైసెన్స్ దుకాణాల్లో కొనుగోలు చేస్తూ రసీదులు పొందాలని సూచించారు. గ్రెసిల్ వల్ల భూములు నిస్సారంగా మారి పర్యావరణం, ఆరోగ్యం నష్టపోతారని రైతులకు సూచించారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మినా, కొన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వినోద్ కుమార్, రైతులు గణేష్, భీమేరా, శివరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

అదనపు కలెక్టర్ మోతిలాల్

కాసిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం సోమగూడెం మల్కేపల్లిలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన విద్యార్థులు చదు వేస్ కుటుంబాలకు చెందినవారిని, ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నదన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదవకో వాలన్నారు. చదువు తో నే సమాజంలో మీతో పాటు తల్లిదండ్రులకు కూడా గౌరవం పెరుగుతుందన్నారు. ఉన్నత చదువులు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, హాస్టల్‌లో బస చేశారు. అంతకుముందు మల్కేపల్లి, సోనాపూర్, వెంకటాపూర్, ధర్మారావుపేట గ్రామాల్లో వయోజన విద్యా బ్యాసన కేంద్రాలను ఆయన పరిశీలించారు. వంద శాతం అక్షరాస్యత సాధించాలన్నారు. ఆయన వెంట వయోజన విద్యా జిల్లా అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్‌పీ అశోక్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

రెయిన్‌గేజ్ పరికరం తనిఖీ

వేమనపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న వర్షపాతం నమోదు యంత్రాన్ని గురువారం జిల్లా డిప్యూటీ ఎస్‌వో ఏఆర్‌కే మూర్తి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పరికరాన్ని శుభ్రంగా ఉంచాలని, పరికరం చుట్టూ చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. ఈ పరికరం ద్వారా మండలంలో ఎంత వర్షపాతం నమోదైందో వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. దీని బాధ్యత స్థానిక రెవెన్యూ సిబ్బంది చూసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్, ఇన్‌చార్జి ఎంపీఎస్‌వో ప్రవీణ్ ఉన్నారు.

ఉగాదికి కొత్త ఆర్‌వోఆర్ చట్టం..

(5వ పేజీ తరువాయి)

బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవడం ద్వారా కార్యాచరణ చేప ట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. భూ సేకరణలు, వ్యవసాయేతర భూములను గుర్తించి మండల, డివిజన్ స్థాయిలో పరిష్కరించేలా మార్పులు తేవడం తోపాటు పట్టాదారు మృతి చెందిన పక్షంలో వారసత్వ భూముల బదలాయింపు ప్రక్రియ వేగవంతం చేయనున్నారు. గ్రామాల్లో ఆబాదీ భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదా బైనామా, భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయడం, ఈసీలో అనుభవదారుడి పేరిట కాలమ్ ప్రవేశపెట్టడం లాంటి మార్పులు చట్టంలో చోటు చేసుకున్నాయి. అప్పీల్ అధారిటీ ఆర్డీవోలకు అప్పగించేలా చర్యలు తీసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అధారిటీ ఉండే విధంగా రూ పకల్పన చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. నూతన ముసాయిదా చట్టం వివిధివరాలను ఇప్పటికే సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచగా, చట్టానికి తుది మెరుగులు దిద్ది అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది.

'రికార్డులను సక్రమంగా నిర్వహించాలి'



భీమినిలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గణపతి

భీమిని, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో గణపతి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, విధుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై ఆరా తీశారు. ఎంపీడీవోతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. జూన్ నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగా మోహన్, ఏపీవో భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు అక్రమంగా పొందితే చర్యలు తప్పవు

జైపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎవరైనా అక్రమ పట్టాలు పొంది తమ విచారణలో తేలితే శాఖపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న భూ దరఖాస్తులపై గురువారం ఇందారం, షెట్‌పల్లి, నర్సింగాపూర్ గ్రామంలో తహసీల్దార్, ఎస్ఐ శ్రీధర్ మోకాపైకి వెళ్లి దరఖాస్తుదారులను పిలిపించి గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్ఐ మాట్లాడుతూ మోకాపై భూమి లేకున్నా ఎవరైనా పట్టా పాస్‌బుక్‌లు పొంది ఉంటే ప్రభుత్వ భూమిలో కానీ పట్టా భూమిలో ఆక్రమణకు ప్రయత్నించినా, ఉద్దేశపూర్వకంగా సరిహద్దు వివాదాలు సృష్టించడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి పాల్గొన్నారు.

'హెచ్‌టీ పత్తి సాగుతో పర్యావరణానికి ముప్పు'

నెన్నెల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత హెచ్‌టీ (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి సాగుతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతుందని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. కలుపు నివారణ కోసం వాడే గ్లైఫోసెట్ మందు ప్రాణాంతకమని, అందులో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని పరిశోధనల్లో తేలిందన్నారు. మండల కేంద్రంలో గురువారం వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులను ఉద్దేశించి సీఐ మాట్లాడారు. నిషేధిత నకిలీ విత్తనాలు విక్రయించినా, కలిగి ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రకార్డులు పట్టుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుప్రజా సృజన, ఎస్సై ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, ఏఈవో రామ్‌చందర్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, గట్టు బానేష్ పాల్గొన్నారు.

గున్నికుంట చెరువును పరిశీలించిన అధికారులు

బెల్లంపల్లిరూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మండలంలోని చాకపల్లి గ్రామంలోని గున్నికుంట చెరువును ఇరిగేషన్‌శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. చెరువు స్థలాన్ని కొంత మంది స్థానికులు కబ్జా చేస్తున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్ వరకు సర్వే జరిపి హద్దులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్, ఇరిగేషన్ శాఖ ఏఈ ప్రణీత్, సునిత, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్, పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

మందమర్రిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి 220 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎల్ఐగా పనిచేస్తున్న అష్టకాల రాజేంద్రప్రసాద్ గురువారం ఉద్యోగ విరమణ పొందగా మంచిర్యాల ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో సహజమన్నారు. అనంతరం ఉద్యోగులు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ దిలీప్, డీఈ రాంటెంకి గులాబ్, ఏడీఈ రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కన్నెపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : జన్కాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఎంఈవో రామ్ ప్రారంభించారు. ఏఐ బోధనతో మెరుగైన విద్య అందుతుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు భూమాచారి, రాజేశ్వరి, రమేష్, సీఆర్‌పీ స్వామి పాల్గొన్నారు

అందుబాటులోకి గ్రామీణ బ్యాంకు సేవలు

తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ

కాసిపేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలందరికి మెరుగైన బ్యాంకు సేవలు అందించేందుకు కొత్త బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ అన్నారు. గురువారం కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి మారుమూల పల్లెలకు గ్రామీణ బ్యాంకు సేవలు అందించేందుకు బ్యాంకులను విస్తరిస్తున్నామన్నారు. తెలంగాణలో 931వ బ్రాంచ్‌గా కొండాపూర్ యాప బ్యాంకును ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకులో కరెంట్, సేవింగ్స్ ఖాతాలను తీసుకుని డబ్బులను పొదుపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ మురళీ మనోహర్, సీఎండీ రవికిశోర్, ఎస్ఎండీ రఘువీరేశ్వర్, మందమర్రియాపల్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శివకుమార్, బెల్లంపల్లి ఏపీఎం బాలేందర్‌నతేశ్, ఏఎంసీపీ మేనేజర్ సాదన, ముత్యం పల్లిమేపేజర్ రాజుఅన్నారెడ్డి, కొండాపూర్ యాప బ్రాంచ్ మేనేజర్ సాయి కృష్ణ, సిబ్బంది, ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

వేమనపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీల్వాయి నుంచి మల్లంపేట వరకు అధ్వాన్నంగా గుంతలు పడి ఉన్న బీటీ రోడ్డుకు గురువారం మండల మాజీ జెడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. ట్రాక్టర్‌తో మొరం తెప్పించి గుంతలల్లో పోయించి లెవెలింగ్ చేయించారు. త్వరలోనే రోడ్డు పనులకు టెండర్లు పిలిచి శాశ్వత మరమ్మతులు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ పాల్గొన్నారు.

'నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు'

తాండూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమిసారవంతం కోల్పోతుందని, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు నకిలీ విత్తనాలను కొనవద్దన్నారు. గ్రామంలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

దండేపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మండలం తాళ్లపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లాస్థాయిలో ఎన్‌హెచ్‌ఎస్‌లో మొదటిస్థానంలో నిలిచి ఉత్తమ అవార్డు పొందిన వైద్యాధికారి డాక్టర్ కాంతికుమార్‌ను నేతకాని మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘం నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రాజమల్లు, నాయకులు రాములుజాడి ఇస్తారి, సాయికుమార్ పాల్గొన్నారు.

మత్స్య అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి

మంచిర్యాలక్రైం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి శ్రీరాంసాగర్ వరకు గోదావరినదిపై నిర్మితమైన ప్రాజెక్టుల పరివాహక ప్రాంతంలో ప్రత్యేక మత్స్య అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఫిషర్ పెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పరీవాహక ప్రాంతంలో మండలిని ఏర్పాటు చేస్తే 25వేల మంది మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మరో పదివేల మంది మహిళా మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని అన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కాలనీ అభివృద్ధి

- సీతారాముల కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి

మందమర్రి టౌన్, మార్చి 27(ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవతో మారుతీనగర్ వార్డు అభివృద్ధి జరుగుతుందని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలనీలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు కాలనీలోని అంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు దారిలో చెట్లు పెరిగి ఇబ్బందిగా మారిందని చెప్పామన్నారు. ఎమ్మెల్యే స్పందించి మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి చెట్లను తొలగించారన్నారు. ఏప్రిల్ 6న స్వామి వారి సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానించామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బండి సదానందం యాదవ్

గ్రంథాలయం తనిఖీ

తాండూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని శాఖ గ్రంథాలయాన్ని గురువారం కార్యదర్శి సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో ఫ్యాన్‌లు, లైట్లు పెట్టించాలని అధికారి రామారావుకు సూచించారు. పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు గ్రంథాలయ అధికారి రమేష్, స్వీపర్ స్వామి పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకులు సహకరించాలి

మందమర్రిరూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణం, మండలంలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు సహకరించాలని తహసీల్దార్ సతీష్‌కుమార్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మీ సేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక రుసుములు వసూలు చేయవద్దని సూచించారు.

మూలన పడిన ట్రాక్టర్



మరమ్మతుకు నోచుకోకుండా ఉన్న ట్రాక్టర్

కన్నెపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాడవెల్లి పంచాయతీ ట్రాక్టర్ రెండు నెలల నుంచి మూలకు పడింది. ట్రాక్టర్ రెండు టైర్లు పంక్చర్ అయ్యాయి. బాగు చేయించే నాథుడే లేకపోవడంతో మూలన పడింది. మాడవెల్లి పంచాయతీలో మూడు గ్రామాలున్నాయి. ట్రాక్టర్ మూలన పడడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు జరగడం లేదు. తడి, పొడి చెత్త సేకరణ ఏళ్ల గడిచినా చేయడం లేదని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించు కోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వెంటనే ట్రాక్టర్‌ను బాగు చేయించి పారిశుధ్య పనులను చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నియమ నిబంధనలతో హనుమాన్ దీక్షలు

- ●ఆలయంలోనే సామూహిక భోజనాలు
- ●ఆధ్యాత్మిక సేవలో హనుమాన్ దీక్షాపరులు

మందమర్రి టౌన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం ఆరంభమైన మార్చి నెలలో హనుమాన్ దీక్షలు తీసుకోవడం భక్తులకు ఆనవాయితీగా మారింది. ప్రతీ సంవత్సరం అయ్యప్ప స్వామి మాలధారణ తరహాలోనే హనుమాన్ మాల దీక్షాపరుల సంఖ్య పెరుగుతూ ఉంది. పట్టణంలోని మార్కెట్ అభయాంజనేయ స్వామితో పాటు స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ దీక్షలు తీసుకుంటున్నారు. వారం రోజుల క్రితమే ఈ దీక్షలు ప్రారంభమయ్యాయి. 41 రోజులు పాటు ఈ దీక్షలు కొనసాగుతాయి. కఠోర నియమాలతో ఈ దీక్షలు కొనసాగుతుంటాయి. కొంత మంది కుటుంబ సభ్యులకు దూరంగా ఆలయాల్లోనే ఉంటున్నారు. ప్రత్యేకంగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో 150 మందికి పైగా దీక్షాపరులు ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తూ దీక్షలు సాగిస్తున్నారు. ఉదయం అల్పాహారం తీసుకోవడం, ఒక్కపూట భోజనంతో దీక్షలను సాగిస్తున్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం యువకులే అధిక శాతం హనుమాన్ దీక్ష తీసుకుంటున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

●పాదయాత్రగా కొండగట్టుకు..

41 రోజుల దీక్షలు ముగిసిన తర్వాత దీక్షాపరులు పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తుంటారు. పదేళ్లుగా ఇక్కడ భక్తులు 200 మంది వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొండగట్టుకు వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. అక్కడే మాల విరమణ చేస్తారు. దీక్షాపరుల నివాసాల్లో ఎవరైనా చనిపోతే తప్ప మాల విరమణ చేయరు.

●దీక్ష నియమ నిబంధనలు..


హనుమాన్ మాల దీక్షలు తీసుకోవడం రెండు పద్ధతులు. ఒకటి 41 రోజులు, రెండోది 21 రోజులు. కాలుకు చెప్పులు ధరించరాదు. సాంప్రదాయ వస్త్రధారణతోనే దీక్షలు సాగించాలి. ఎదుటి వారిని జై శ్రీరామ స్వామి అని సంబోధించాలి. ప్రతీ మహిళలను తల్లి రూపంలో భావించాలి. ఉదయం 4 గంటలకు స్నానాలు ఆచరించాలి. జపం పూజ చేసుకొని 7 గంటలలో పు హారతి తీసుకోవాలి. హనుమాన్ దీక్షలు తీసుకున్న భక్తులు ఇంటికి దూరంగా ఆలయాల్లో ఉండడం మంచిది. కేవలం స్వామి నామస్మరణలోనే గడపాలి.

●పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం..

పట్టణంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో దీక్షాపరులకు నిత్యాన్నదానం కొనసాగుతుంది. దశాబ్ద కాలంగా ఆలయంలో దీక్షాపరులు వారి సొంత ఖర్చులతో నిత్యాన్నదానాన్ని కొనసాగిస్తున్నారు. పంచముఖ స్వామి హయగ్రీవ, నారసింహ, ఆంజనేయ, గరుడవరాహ ముఖాలతో భక్తులకు దర్శనం ఇస్తున్నందున దీక్షలు తీసుకునే వారి సంఖ్య పెరుగుతుంది.


●దీక్షలతో మంచి జరిగింది..

సద్దాం రాజ్‌కుమార్



పది సంవత్సరాలుగా హనుమాన్ దీక్ష తీసుకుంటున్నాను. స్వామి పై విశ్వాసంతో దీక్షలు తీసుకోవడం వల్ల నాకు మంచి జరిగింది. 41 రోజుల పాటు కఠినంగా దీక్షల్లో ఉండడం వల్ల ఆటు ఆరోగ్యంతో పాటు భక్తి కూడా పెరుగుతుంది. కుటుంబాల్లో కూడా ఆధ్యాత్మిక భావన పెరిగి సాటి వారి పట్ల ప్రేమ, కరుణతో ఉంటారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల జిల్లా వార్తలు
5
శుక్రవారం 28 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:25 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:56 (శనివారం ఉదయం)

బస్తీ దవాఖానాలో ఉద్యోగాలు

గర్మిళ్ల, మార్చి27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కింద బస్తీ దవాఖానాలో మెడికల్ ఆఫీసర్-1, స్టాఫ్ నర్స్-1, సపోర్ట్ స్టాఫ్-2, పీహెచ్‌సీ ఎన్‌సీడీ విభాగంలో స్టాఫ్ నర్సు-1 పోస్టులు భర్తీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నోటీసుల జారీ చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 3వతేదీ వరకు అప్లై చేసుకోవాలని కోరారు. ఈ ఆప్లికేషన్లు ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 5గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఐడీవోసీ నస్పూర్ నందు ఇవ్వగలరు. వివరాలు వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కార్యవర్గం ఎన్నిక

జన్నారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జన్నారం, పొన్కల్, అక్కపల్లిగూడెం ఐక్య గ్రామాల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నట్లు గ్రామాల వ్యవస్థాపకులు ఎరుకల రాజగౌడ్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా గొల్లపెల్లి చంద్రమౌలిగౌడ్, అధ్యక్షులుగా తాళ్లపెల్లి రాజేష్, ఇన్‌చార్జిగా హైమద్ పాషా, ఉపాధ్యక్షులుగా మహ్మద్ సమీర్, లింగన్న, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా ప్రేమ్‌సాగర్‌రావు, శేఖర్, సింహారాజు, లింగన్న, ప్రధాన కార్యదర్శిగా శివరామ కృష్ణ, చందు, మణికంఠ, ప్రచార కార్యదర్శులుగా లక్ష్మణ్, హబీబ్, కార్యదర్శిగా కలీమ్, సురేష్, అశోక్, కోశాధికారిగా అంజయ్య, అధికార ప్రతినిధిగా కిరణ్, రవికుమార్, సోసల్ మీడియా ఇన్‌చార్జిగా సాధిక్, రాజేష్, ముఖ్య సలహాదారులుగా శేఖర్, రాకేష్‌గౌడ్, లక్ష్మణ్, సలహదారులుగా పోశన్న, వెంకటేష్, సాధిక్‌బాబా, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, ప్రశాంత్, మహేష్, షకీర్‌లను ఎన్నుకున్నారు. నాయకులు మహ్మద్ ఆలీ, సత్యగౌడ్, ఖాదర్‌ఖాన్, అంజన్నలు నూతన సభ్యులను అభినందించారు.



ఉగాదికి కొత్త ఆర్వోఆర్ చట్టం..!

రెండు ఆర్వోఆర్‌లలో తేడాలు..		
అంశం	2020	2025
సవరణలు	అవకాశం లేదు	అవకాశం ఉంది
రిజిస్ట్రేషన్	తహసీల్దార్	తహసీల్దార్, డీటీ
మ్యూటేషన్	సెక్షన్ 5,6,7	సెక్షన్ 5,7,8 విచారణతో
సబ్‌డివిజన్	లేదు	అవకాశం కల్పించారు
డాక్యుమెంట్	పాస్‌బుక్	పాస్‌బుక్
అప్పీల్	లేదు	సెక్షన్ 14,15లతో ఏర్పాటు



- భూ రికార్డుల్లో తప్పుల సవరణలకు చట్టబద్ధత
- వేర్వేరు భూములకు ప్రత్యేక రికార్డులు
- మూడేళ్ల నుంచి పేరుకుపోయిన సమస్యలు
- వ్యవసాయేతర భూములకూ పాస్‌బుక్స్ జారీ

మంచిర్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్వోఆర్ చట్టం తేవడం ద్వారా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మూడేళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు కొత్త చట్టంతో పరిష్కారం చూపేందుకు సన్నద్ధం అవుతోంది. ఈ విషయమై ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తికాగా ఉగాది పర్వదినం సందర్భంగా నూతన చట్టాన్ని అమలులోకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ సర్కారు తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కారణంగా రైతుల ప్రమేయం లేకుండానే రెవెన్యూ రికార్డుల్లో తప్పులు దొర్లడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. రెవెన్యూ సిబ్బంది చేసిన తప్పులకు అనేక మంది రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పూర్వీకుల నాటినుంచి పట్టాగా ఉన్న భూములను ప్రభుత్వానివంటూ ఎలాంటి నోటీసులు లేకుండానే నిషేధిత జాబితాలో పెట్టి అష్టకష్టాలు పెడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. కొత్త చట్టం భూభారతి అమల్లోకివస్తే... ధరణి పోర్టల్ కారణంగా ఇబ్బందులు పడ్డ ప్రజానీకానికి సాంత్వన కలిగే అవకాశాలు ఉన్నాయి.

కోర్టును ఆశ్రయించక తప్పని పరిస్థితి..

ధరణి పోర్టల్‌లో తప్పొప్పుల సవరణకు ఇంతకాలం చట్టబద్ధతే లేకుండాపోయింది. సంబంధిత అధికారులకు అధికారాలను సైతం చట్టబద్ధంగా కట్టబెట్టకపోవడంతో సమస్యలు అపరిష్కృతంగా మిగిలి పోయాయి. పేరు తప్పుబడినా, సర్వేనంబర్ మిస్‌అయినా.. సిబ్బంది తప్పులకు సైతం కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి కల్పించారు. కోర్టుకు వెళ్లి ఆర్డర్‌కాపీ తెచ్చుకోండని సమస్యలతో వచ్చే రైతులకు మొహం మీదనే చెప్పేవారు. ధరణి పోర్టల్, ఆర్వోఆర్ 2020 నిబంధనలు, చట్టం కొందరికి మాత్రమే చుట్టాలుగా మారాయి. సామాన్యులకు చుక్కలు చూపించాయి. ఇప్పుడా చట్టాన్ని మార్చి రైతాంగానికి చిక్కులు తొలగించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసు కొస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్, మాజీసీఎస్ సోమేష్‌కుమార్...అన్నీ తామై రూపొందించిన ధరణి పోర్టల్, ఆర్వోఆర్ చట్టంలోని లొసుగులను సవరించి రైతులకు మేలుచేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

భూ రికార్డుల నిర్వహణ..

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ పేరును రేవంత్ సర్కారు భూ భారతిగా నామకరణం చేసిన సంగతి తెలిసిందే. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న భూ రికార్డుల నిర్వహణ పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయాలనే నిశ్చయానికి ప్రభుత్వం వచ్చింది. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా..

మిగతా 7లో

అధిక ఫీజులు వసూలు చేస్తున్న మీ-సేవలపై చర్యలు తీసుకోవాలి

- ఐక్యవిద్యార్థి సంఘాల డిమాండ్

గర్మిళ్ల, మార్చి27(ఆంధ్రజ్యోతి): అధిక రుసుంలు వసూలు చేస్తున్న మీసేవలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, పురెళ్ల నితీష్ మాట్లాడుతూ మీ సేవల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించి జిల్లాలోని మీసేవా నిర్వహకులు ఆదాయ, కుల ధృవీకణ వంటి సేవలకు ప్రభుత్వం నిర్ణయించన ధరలకంటే అదనంగా రూ.15, ఇతర రెవెన్యూ పౌరసేవలకు 50రూపాయల నుంచి 300 వరకు అదనంగా వసూలు చేస్తూ ప్రజల జేబులకి చిల్లుపెడుతున్నారన్నారు. దీనికితోడు రెవెన్యూఅధికారులు కులధృ వీకరణ సర్టిఫికేట్‌కోసం ప్రజలు పూర్వ కులధృవీకరణ పత్రం జతపరుస్తున్న జిరాక్స్ పత్రం అదనంగా 200 నుంచి 300రూపాయలు ఖర్చు అయ్యేవిధంగా అడ్వకేట్ నోటీరీ సెల్ఫ్ అఫడవిట్ జతపరుచాలని లేదంటే సంతకాలు చేయమని అమాయక ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారన్నారు. అధికంగారుసుంలు

'సోషల్ మీడియాలో వదంతులను నమ్మవద్దు'

కోటపల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వచ్చే వదంతులను, పుకార్లను నమ్మవద్దని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, తహసీల్దార్ రాఘవేందర్‌రావులు అన్నారు. గురువారం మండలంలోని కొల్లూరు ఇసుక రీచ్ వద్ద జాతీయ రహదారిపై లారీలతో ట్రాఫిక్ జామ్ అయ్యిందనే సమాచారంతో అక్కడకు వెళ్లిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. బుకింగ్ అధికంగా ఉండడంతో లారీలు అధికంగా వచ్చాయని, లోడ్ లారీ, అన్‌లోడ్ లారీలతో ఐదు నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్ అయిన విషయం నిజమేనని అయితే వీటిని గంటల కొద్ది నిలిపినట్లు వదంతులు సృష్టించారన్నారు. ఇలాంటి పుకార్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం టీఎండీసీ అధికారులతో మాట్లాడిన అధికారులు లారీలను రోడ్లపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటి తహసీల్దార్ నవీన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మామిడిగూడలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో గంగా మోహన్

భీమిని, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భీమిని మండలంలోని మామిడిగూడ గ్రామంలో 'భగీరథ ఉన్నా..చెలిమలే దిక్కు' అనే అంశంపై ఆంధ్రజ్యోతి మెయిన్ పేజీలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో గంగా మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోచన్నలు గురువారం గ్రామానికి వెళ్లి మిషన్ భగీరథ ట్యాంకు, పైపు లైన్లు ట్యాపులను స్వయంగా పరిశీలించారు. అక్కడికి వచ్చిన స్థానిక ప్రజలతో భగీరథ నీరు సరఫరాపై ఆరా తీసారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని గ్రామస్థులు తెలియజేశారు. దీనికోసం అవసరమైన చిన్న చిన్న మరమ్మతులను గ్రామ పంచాయతీ సిబ్బందితో పూర్తి చేయించారు. మేజర్ రిపేర్లను రేపటితో పూర్తి చేయిస్తామని గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు అందరూ శుద్ధి చేయబడిన మిషన్ భగీరథ నీటిని మాత్రమే తాగాలని, చెలిమల లోని నీరు ఎవ్వరూ తాగవద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ రాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఏఐ బోధనతో విద్యార్థులకు మేలు

జన్నారం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఏఐ బోధన ఎంతో మేలు చేస్తుం దని ఎంఈవో విజయ్‌కుమార్ సూచించారు. గురువారం జన్నారం, పొనకల్, ఇందన్‌పల్లి, కొత్తపేట బి ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధన ల్యాబ్‌లను ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగంలో కృత్రిమే మేధ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, విజయ్‌కుమార్, విజయకుమారి, ఉపాధ్యాయులు సుధాకర్, మణికంఠ శర్మ, జయమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మనోధైర్యాన్ని కల్పించాలి

మంచిర్యాలక్రైం/కలెక్టరేట్ మార్చి27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు చేసే గొప్పసాయం మనోధైర్యాన్ని అందించడమే అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు అలీంకో వారి ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు తమ తరుపున ఇవ్వడానికి భవిత కేంద్రాలు ఉంటాయని వీటిలో ప్రత్యేకశిక్షణ పొందిన అర్హతగలిన నిపుణులు బోధకులు ఉంటారన్నారు. వారి సేవలను ఉపయోగించుకొని నాణ్యమైన జీవన నైపుణ్యాలు అందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయా లన్నారు. రూ. 17.50లక్షల విలువగల ఉపకరణాలను ఆయన అందించారు. అనంతరం జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లా డుతూ దివ్యాంగులు లేని విద్యార్థులకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎంతో విలువైన ఉపకరణాలను సద్విని యోగం చేసుకొని విద్యార్థులు ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ చౌదరి, యశోదర, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, ఎఎస్‌ఓ రాజుకుమార్, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

మంచిర్యాల కలెక్టరేట్: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్ అన్నారు. గురువారం హైద్రాబాద్ నుంచి కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతు సంక్షేమంలో భాగంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నాణ్యమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే మహిళ సంఘాలకు పెట్రోలు బంకులు నిర్వహించేందుకు అవకాశం కల్పించి ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రబీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహనలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ సంఘాలకు కేంద్రాలను కేటాయించేలా కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదను కలెక్టర్ మోతిలాల్, డీఆర్ డీవో కిషన్, బ్రహ్మారావు, శ్రీకళ, తిరుపతి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించండి

నస్పూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న 130 మంది ఔట్ సోర్సింగ్, 105 మంది కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లింపులో జాప్యం జరుగుతుందని, తక్షణమే వేతనాలు చె ల్లించాలని తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆ ధ్వర్యంలో గురువారం సాయంత్రం కార్మిక శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయకుంటే వ చ్చే నెల 2 నుంచి సమ్మెలోకి వెళ్తామని ఈ సందర్భంగా నాయకులు తె లిపారు. 130 మంది ఔట్ సోర్సింగ్ వారికి మూడు నెలల వేతనం, 105 మంది కాంట్రాక్టు కార్మికులలో 86 మందికి మూడు నెలలు, 19 మందికి 18 నెలల వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. పీఎఫ్, ఇఎస్ఐ బకాయిలు కూడా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ కాం ట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి, గౌరవాధ్యక్షు డు దేవి సత్యం, ప్రధాన కార్యదర్శి కొండ్ర లింగయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ అందె చంద్రయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



కార్మికశాఖ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కార్మికులు దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలి

శ్రీరాంపూర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాలకు చెందిన కార్మికులు మే 20వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్. బాలరాజు అన్నారు. సివిల్‌సప్లై హమాలీ యూనియన్ మంచిర్యాల జిల్లాశాఖ సమావేశం గురువారం శ్రీరాంపూర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఆయ న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ కోడ్లను 4 కోడ్లుగా విభజించి ఏప్రిల్ 1 నుంచి అమలు చేయడాన్ని నిరసిస్తూ ఈ సమ్మెకు పూనుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, సివిల్ సప్లై హమాలీ కార్మికులు పానుగంటి సత్యనారాయణ, తిప్పని సత్తయ్య, పొరండ్ల సంప త్, నరేష్, రాజన్న, చంద్రయ్య, పాల్గొన్నారు.

- రూ. లక్షల్లో నష్టపోతున్న యువత
- టీవీలకు అతుక్కుపోతున్న విద్యార్థులు

కాయ్ రాజా కాయ్ జోరుగా బెట్టింగ్‌లు

మంచిర్యాల క్రైం, మార్చి27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ అభిమానులకు వేసవి కాలం వచ్చిందంటే ఒక పండగే. ముఖ్యంగా ఐపీఎల్ మ్యాచ్‌లతో యువత ఊగిపోతున్నారు. సాయంత్రం అయిందంటేచాలు టీవీలకు అతుక్కుపోతున్నారు. అభిమాన ఆటగాడు ఫోర్లు, సిక్స్‌లు బా దితే కేరింతలు కొడుతున్నారు. జట్టు గెలిస్తే తామే గెలి చినట్టుగా సంబురాలు చేసుకుంటూ స్వీట్లు పంపిణీ చేసుకుంటున్నారు. అభిమానుల సంబరాలు ఇలా ఉంటే మరోవైపు అదే అదునుగా రాష్ట్రంలో ఐపీఎల్ బెట్టింగు రాయుళ్ల రెచ్చిపోతున్నారు. ఈ బెట్టింగ్‌లు పల్లెల్లో కూడ విష సంస్కృతిగా పాకుతోంది. నిర్వాహకులు దీనిద్వారా కోట్ల రూపాయలు సంపాదిస్తుంటే బెట్టింగ్‌పెట్టిన వారు గంటల వ్యవధిలోనే వేల నుంచి లక్షల రూపాయలు నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో చిక్కిపోతున్నారు. కొందరైతే డబ్బులు లేకుంటే ఆన్‌లైన్ రుణయాపుల్లో అప్పులు సైతం చేస్తున్నారు. అప్పులు తిరిగి చెల్లించలేక ఒత్తిడికి గురవుతున్నారు. మరికొందరు పరీక్షల సమయంలోసైతం టీవీకి అతుక్కుంటూ తమ బంగారు భవి ష్యత్‌ను విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. చదవాల్సిన సమయంలో చదవకుండా క్రికెట్‌కు బానిసలై చదువులో వెనుకబాటు పడడంతో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. తల్లిదండ్రులు ఎంత చెప్పినప్పటికీ క్రికెట్ పిచ్చితో తమ భవిష్యత్‌ను వారు చేతులారా నాశనం చేసుకుంటున్నారు. క్రికెట్ చూడడం తప్పు కా దు కాని అదే పనిగా చదువుకోవాల్సిన సమయంలో టీవీలు చూస్తూ క్రికెట్‌లో లీనమైపోతున్నారు.



ఐపీఎల్ బెట్టింగ్‌లో నమోదైన కేసులు...

మంచిర్యాల జిల్లా పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్‌లు మంచిర్యాల జిల్లా కేంద్రంలో బాగా నడుస్తున్నాయి. పోలీసులకు చిక్కకుండా రహస్య ప్రదేశాల్లో బెట్టింగ్‌ల కు పాల్ప డుతున్నారు. 2020 సంవత్సరంలో నస్పూర్‌లో ఒక కేసు, మంచిర్యాలలో రెండు కేసులు నమోద య్యాయి. 2021లో నస్పూర్‌లో ఒక బెట్టింగ్ కేసు నమోదైంది. 2024లో ఒక కేసు నమోదు కాగా 10వేల ను స్వాధీనం చేసుకొని పది మందితో పాటు 9 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో బెట్టింగ్‌లకు ఎక్కువగా పాల్పడుతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బెట్టింగ్ రాయుళ్లపై ప్రత్యేక నిఘా...

- ఆర్. ప్రకాశ్, ఏసీపీ

జిల్లా కేంద్రంలో బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైన బెట్టింగ్‌లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం. ముఖ్యంగా విద్యార్థులు వారి వ్యవహార శైలిపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలి. చదువుకునే సమయంలో పిల్లలు పక్కదారి పడితే జీవితంపై ప్రభావం చూపుతుంది.